
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025



అలాంటి వ్యక్తి భూమ్మీద పుట్టకూడదు

"ఆయన హిందువు కాదు. కుమార్తెకు ఏ సంప్రదాయం ప్రకారం వివాహం చేశారో అందరికీ తెలుసు. హిందూ వ్యతిరేక వ్యక్తి గతంలో టీటీడీ ఛైర్మన్ కావడం మనందరి దురదృష్టకరం. గడువు అయిపోయిన మందులు, పురుగులు పట్టిన దాణా ఇచ్చిన వ్యక్తి గోవుల గురించి మాట్లాడుతున్నారు. ఇలాంటి వ్యక్తి భూమిపై పుట్టకూడదని స్వామివారిని కోరుకుంటున్నా. దేవుడి సొమ్ము తిన్న వారిని తప్పకుండా భగవంతుడు శిక్షిస్తాడు."

- బీఆర్ నాయుడు, టీటీడీ ఛైర్మన్, తిరుపతి గోశాలలో..

గోవుతో, గోవిందుడితో ఆడుకోవద్దు



"రాజకీయ ప్రయోజనాల కోసం గోవుతోనూ, గోవిందుడితోనూ ఆడుకోవద్దు. గతంలో రెండుసార్లు టీటీడీ ఛైర్మన్‌గా, సభ్యుడిగా పని చేసిన వ్యక్తి, అబద్ధపు ప్రచారాలతో భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. టీటీడీ ప్రతిష్టను దిగజార్చమే అజెండా పెట్టుకున్నారు. ఎక్కడో జరిగిన గో మరణాలను ఇక్కడ జరిగినట్టు చూపిస్తున్నారు. టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబోతున్నాం."

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తిరుమలలో..

ఇది హిందువులపై కుట్ర



"దేవుడు లేడు, వేంకటేశ్వర స్వామి ఓ నల్లరాయి. నల్లరాయిపైన చెప్పుతో వేస్తే ఏమవుతుంది' అని మాట్లాడిన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయ్యాక టీటీడీ నిధుల్లో కమీషన్లు ఎలా తీసుకున్నారో అందరికీ తెలుసు. ఇలాంటి వ్యక్తి హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కుట్ర చేస్తున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల పాత్ర ఉంది. వీటన్నింటికీ తగిన మూల్యం చెల్లించక తప్పదు"

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

పడమర సరే
తూర్పు మాటేమిటి?

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారులు అనుసరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. రోడ్డుకు పడమర వైపున 120 అక్రమ నిర్మాణాలను ఏకకాలంలో కూల్చివేసి, తూర్పు వైపునకు వచ్చే సరికి దోబూచులాడుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

ఆక్రమణల తొలగింపులో వివక్ష

కొన్నింటిని కూల్చేసి.. మరికొన్నింటిపై మీనమేషాలు

శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు



రాజీవ్‌నగర్‌లో తూర్పు వైపున అక్రమ నిర్మాణాలు

శ్రీకాళహస్తి శివారులోని రాజీవ్‌నగర్ కాలనీ 2005లో ఏర్పాటైంది. 7వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అప్పట్లో సరైన అవగాహన లేకపోవడం, బిల్లులు సకాలంలో రాకపోవడం వంటి కారణాలతో లబ్ధిదారులు ఎవరన్నది స్పష్టత లేకపోయింది. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి కలెక్టర్ పర్యవేక్షణలో సమగ్ర సర్వే నిర్వహించారు. 2014 నుంచి 2019 వరకు రాజీవ్‌నగర్‌లో నిర్మాణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో కబ్జాదారుల కళ్లు ఆ స్థలాలపై పడ్డాయి. టీడీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు వారి ఆటలు సాగలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అక్రమార్కులకు రాజీవ్‌నగర్ వరంగా మారింది. ఖాళీజాగా కనిపిస్తే పాగా వేసేశారు. అడ్డు వచ్చిన లబ్ధిదారులపై దాడులకు తెగబడ్డారు. ఇళ్ల స్థలాలు కేటాయించే సమయంలో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా భవిష్యత్తు అవసరాల కోసం విస్తారంగా స్థలం వదలిపెట్టారు. వైసీపీ నేతలు రోడ్డుకు పడమర వైపున ఖాళీ స్థలాలు ఆక్రమించి, అమ్మిసొమ్ము చేసుకున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలు తొలగిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే రోడ్డుకు పడమర వైపు దౌర్జన్యంగా నిర్మించిన 120 కట్టడాలను అధికారులు కూల్చివేశారు.

అటువైపు ఆక్రమణల మాటేమిటి?

రాజీవ్‌నగర్‌లో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని తూర్పువైపున అక్రమార్కులు పెద్దయెత్తున కబ్జాలు చేశారు. రోడ్డు నుంచి ఇళ్ల స్థలాలకు మధ్యలో కొంత ప్రభుత్వ భూమిని వదిలిపెట్టారు. దీనిపై కన్నేసిన వైసీపీ నేతలు అప్పటి రెవెన్యూ అధికారుల అండతో ఖాళీ స్థలాల్లో పెద్దయెత్తున దుకాణాలు నిర్మించి, విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పైగా ఇళ్లు కట్టుకున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి స్థలాలను స్వాహా చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కుమారుడి కోసం మొక్కు చెల్లించి..!

సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తమ కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడటంతో శ్రీవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం సాయంత్రం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలకు వచ్చారు. టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం చేసిన ఆమె వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారికి మొక్కుగా తలనీలాలు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

ముక్కంటి ఆలయం ఆదివారం కిక్కిరిసింది. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడం, ఇంటర్ ఫలితాలు వెలువడడంతో భక్తుల తాకిడి పెరిగింది. శనివారం రాత్రి పట్టణంలోని లాడ్జిలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆదివారం వేకువజాము నుంచి ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు క్యూలలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మంది దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. దళారులు అడ్డదారిలో ప్రవేశించకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించడంతో సామాన్య భక్తులు సంతృప్తికరంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తం ఐదు విభాగాల్లో 5723 రాహు కేతు పూజలు జరిగాయి. రూ.50 శీఘ్ర దర్శనం టికెట్లు 4312, రూ.200 ప్రత్యేక ప్రవేశ దర్శనం 4312 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం టికెట్లు రికార్డు స్థాయిలో భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం కోసం భక్తులు దళారులను ఆశ్రయించకుండా అడ్డుకట్ట వేసేందుకు రెండు నెలల క్రితం రూ.500 టిక్కెట్లను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. మెల్లగా ఈ టిక్కెట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 618 టికెట్ల విక్రయాలు జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

2 నెలలు 4 వేల కేసులు

డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల కఠిన వైఖరి



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆ దిశగా ఉక్కుపాదం మోపుతున్నారు. ఫలితంగా ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు మద్యం తాగి బండి నడిపిన నాలుగు వేల మందిపైన కేసులు నమోదుచేశారు. ఇందులో జిల్లాలోని వివిధ కోర్టుల ద్వారా దాదాపు 210 మందికి జైలు శిక్షలు పడ్డాయి. ఈ కేసుల ద్వారా దాదాపు రూ. 32.30 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేసిన్నట్లు సమాచారం. డ్రంకెన్ డ్రైవ్ కేసులో తొలి రెండు సార్లు పట్టుబడితే రూ.పది వేల చొప్పున న్యాయ స్థానం జరిమానా విధిస్తోంది. మూడోసారి పట్టుబడితే జైలు శిక్ష విధిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించడంతో.. పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 5 గంటలైందంటే జిల్లాలోని చాలా సర్కిళ్ళు, జన సమర్థమైన ప్రాంతాలలో పోలీసులు బ్రీత్ అనలైజర్లతో తనిఖీలు చేపట్టారు. ఎక్కువ రీడింగ్ వచ్చిన వారిపై కేసులు నమోదుచేసి స్లిప్పులు చేతిలో పెడుతున్నారు. ఎవరైనా న్యూసెన్స్ చేసే ప్రయత్నంచేసినా పొలిటికల్ ముసుగులో వార్నింగ్‌లు ఇచ్చినా బాడీ ఓన్ కెమెరాల ద్వారా వీడియోలు తీసి కోర్టుల ముందు ఎవిడెన్స్ పెడుతున్నారు.

వాతావరణం అనుకూలించక..!

● చెన్నైలో ల్యాండ్ అయిన ఇండిగో విమానం

రేణిగుంట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం రాత్రి 8 గంటలకు ల్యాండ్ కావాల్సిన ఇండిగో విమానం ఈదురుగాలులతో వాతావరణం అనుకూలించక 20 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత చెన్నైలో ల్యాండ్ అయి.. అనంతరం రాత్రి 11.10 గంటలకు రేణిగుంటకు చేరింది. 11.45 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. 12 గంటలకు బయలుదేరింది.

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ నేపథ్యంలో విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య 14 ప్రత్యేక రైళ్ల రాకపోకలు మే 29వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. విశాఖపట్నం- తిరుపతి.. ప్రత్యేక రైలు (08547) 16 నుంచి మే 28వ తేదీ వరకు ప్రతి బుధవారమూ విశాఖలో.. మరో ప్రత్యేక రైలు (08548) 17 నుంచి మే 29వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరుతుందని తెలిపారు. విశాఖపట్నం-బెంగళూరు మధ్య 14 ప్రత్యేక రైళ్లు విజయవాడ, రేణిగుంట, జోలార్‌పేట, కుప్పం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్



సర్వదర్శనం క్యూలో భక్తులు

తిరుమలలో రద్దీ బాగా పెరిగింది. వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.33 కోట్లు రాగా.. శనివారం 72,923 మంది స్వామిని దర్శించుకోగా, 35,571 మంది తలనీలాలు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



శ్రీవారి సేవలో మీనాక్షి

తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకుని వస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి.



డ్రోన్‌ను ఎగురవేసి పనితీరును గమనిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ఆరు డ్రోన్లు వచ్చాయోచ్

● అత్యాధునిక టెక్నాలజీతో ఆకతాయిల ఆటకట్టు

● ట్రాఫిక్, నేర నియంత్రణకు ప్రాధాన్యం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖకు ఆరు డ్రోన్లు వచ్చాయి. తిరుపతి నగరం, జిల్లా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ వెంకటేశ్వర్లు పోలీస్ శాఖకు రూ.30 లక్షలు ప్రత్యేకంగా విడుదల చేశారు. వీటిలో రూ.15 లక్షలు వెచ్చించి ఆరు డ్రోన్లు కొనుగోలు చేయగా.. మిగిలిన రూ.15 లక్షలతో సీసీ కెమెరాలు కొననున్నారు. కాగా, ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో ఈ డ్రోన్ల పని తీరును ఎస్పీ హర్షవర్ధనరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిధులు విడుదల చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆరు డ్రోన్లలో.. నాలుగు మ్యాట్రిస్, ఒక థర్మల్ డ్రోన్స్ కెమెరా, మరొకటి మ్యావిక్ ఎయిర్ 3ఎస్-05 కెమెరా ఉన్నాయి.మ్యాట్రిస్-4 థర్మల్ డ్రోన్ కెమెరా ఒక కిలో మీటరు ఎత్తు వరకు ఎగురుతుంది. నగరాల పరిధిలో రెండు నుంచి మూడు కిలో మీటర్ల వరకు ఖాళీ ప్రదేశాల్లో 3-4 కిలోమీటర్ల దూరం వరకు వెళుతుంది. ఇందులో థర్మల్ ఇమేజింగ్ ఉంటుంది. దీంతో 48 మెగా పిక్సల్‌తో మూడు కెమెరాలు ఉన్నాయి. నైట్ మోడ్ ఎఐ కెమెరా ద్వారా హెడ్ కౌంట్, వాహనాల రాకపోకలను కౌంట్ చేస్తుంది. థర్మల్ కెమెరా ద్వారా అడవుల్లోని మనుషులను, జంతువులను గుర్తించవచ్చు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు థర్మల్ కెమెరాను ఉపయోగించి మనుషులు ఎవరైనా ఉన్నారా అని గుర్తించవచ్చు. సర్వేలెన్స్, మానటరింగ్ ఆఫ్ పబ్లిక్, ట్రాఫిక్ మానిటరింగ్ చేసుకోవచ్చు. వీటితో పాటు పబ్లిక్ అనౌన్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఈ డ్రోన్లను ఎలా ఉపయోగించాలి, అవసరాన్ని బట్టి డేటా ఎలా సేకరించాలి అనే విషయాలపై ఇప్పటికే 40 మంది పోలీసులకు శిక్షణ ఇప్పించినట్లు ఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, ఆర్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు నిర్వహిస్తే చర్యలు

జిల్లాలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో బర్త్‌డే పార్టీలు, ఇతర నిషేధిత కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు తనిఖీలు ఉంటాయన్నారు. కొత్తగా వచ్చిన ఆరింటితో పాటు మొత్తం ఏడు డ్రోన్లు పోలీసు శాఖకు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో నేరాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఓపెన్ బూజింగ్, గంజాయి విక్రయాలు, వినియోగం వంటి వాటిని నియంత్రించడానికి ఉపయోగిస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాంగ్ రూట్ కేసులు 359

జిల్లా వ్యాప్తంగా మార్చి నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు రాంగ్ రూట్‌లో వచ్చిన వారిపై 359 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదివారం తెలిపారు. తద్వారా రూ.12.40 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఓపెన్ బూజింగ్ ద్వారా 3145 కేసులు నమోదు కాగా వీటిలో 3202 మందికి జరిమానాలు విధించామన్నారు. 11 కేసులకు సంబంధించి 119.05 కిలోల గంజాయి సీజ్ చేసి.. 26 మందిని అరెస్టు చేశామన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరిస్తా : నాని



ఎమ్మెల్యే నానికి జ్ఞాపిక అందజేస్తున్న అధ్యాపకులు

పాకాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు కొత్త భవనం, విద్యార్థినులకు హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా బాధ్యతగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.మొహిద్దీన్ బాషా, డాక్టర్ ఎస్.దామోదరనాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



పాకాలలో ఈత మట్టలతో క్రైస్తవులు

పాకాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రైస్తవులు ఘనంగా మట్టల ఆదివారం జరుపుకొన్నారు. యెరూషలేంలోకి యేసు ప్రభువు ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకొని పుష్పాలతో అలంకరించిన ఈతమట్టలను పట్టుకొని స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చ్ నుండి సెయింట్ పాల్స్ చర్చి వరకు ప్రదర్శనగా వెళ్లారు. యేసుక్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడారు. సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చిలో మట్టలను చేతబట్టుకొని చర్చి ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంతోని రాజ్, సీఎస్ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్, సెక్రటరీ విక్టర్ ఎం.రాఘవేలు, ట్రెజరర్ జి.అరుళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన



చంద్రగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం సామూహిక లక్ష కుంకుమార్చన ప్రారంభమైంది. సోమ, మంగళవారాల్లో దీనికి నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కి వివిధ రకాల అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి సామూహిక లక్ష కుంకుమార్చన చేశారు. రాత్రి ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న అలంకరణలో కోదండరాముడు



ఉత్సవర్లను ఊంజల్ సేవకు తీసుకొస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాములవారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవారికి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని వేంకటేశ్వరస్వామి అలంకరణ చేసి కనులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పొరంబోకు ఆక్రమణకు అడ్డుకట్ట



తొండవాడ వద్ద అక్రమ కట్టడాల నిర్మాణం

చంద్రగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తొండవాడ వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువ పొరంబోకు స్థలాన్ని కబ్జా చేయడానికి చేసిన ప్రయత్నాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆదివారం జాతీయ రహదారిలో హ్యాపీ దాబా ఎదురుగా కాలువ పొరంబోకు స్థలంలో కొందరు జేసీబీ, క్రేన్‌ల సాయంతో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. దీంతో గ్రామస్థులు వెళ్లి అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. వీఆర్వో యజ్ఞశ్రీ సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ, క్రేన్‌లను పోలీస్ స్టేషన్ తరలించారు.

గోవింద ధామానికి రూ.1.10లక్షల విరాళం

చంద్రగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖినది వద్ద నిర్మిస్తున్న గోవింద ధామానికి చంద్రగిరికి చెందిన యారాశి మదన్‌మోహన్‌రెడ్డి రూ.1,10,116 విరాళంగా అందజేశారు. ఇటీవల ఈ నిర్మాణానికి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నానిలు భూమిపూజ చేశారు. ఆరోజే దాతలు రూ.24 లక్షలు ప్రకటించారు. ఈక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి రూ.1,10,116 రూపాయల చెక్కును ఎమ్మెల్యే నానికి అందజేశారు. నాని అభినందించారు. పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి, డాక్టర్ వాసు, డిష్ గోపి, గౌస్‌బాషా, నాగరాజునాయుడు, ఓంకార్‌లు పాల్గొన్నారు.

జోరుగా రహదారి విస్తరణ పనులు



తిరుపతిరూరల్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సర్కిల్ నుంచి శ్రీనివాసమంగాపురం వరకు టీటీడీ నిధులతో చేపడుతున్న నాలుగులేన్ల రహదారి(డబుల్‌లేన్)విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. గతవైసీపీ ప్రభుత్వంలో ఈరహదారి విస్తరణకు పనులు ప్రారంభించి పుదిపట్ల పంచాయతీపరిధిలో కొంత దూరం వరకు వైట్‌మిక్స్(గ్రావెల్)ని నింపి చదును చేశారు. అటవీశాఖ నుంచి పూర్తిస్థాయిలో అనుమతి రాకపోవడం, ఎలక్ట్రికల్ లైన్ల సమస్యతో కొంతకాలం ఈపనులను నిలిపివేశారు. ప్రస్తుతం అటవీశాఖ అనుమతితో రహదారి పొడవునా ఉన్న చెట్లని తొలగించి.. విస్తరణ పనులను చేపడుతున్నారు. చదును చేస్తున్నారు. ఇప్పటికే నాలుగులేన్ల రహదారికి మధ్య విద్యుత్ స్తంభాలను అమర్చారు. ఈరహదారిలో భక్తులతోపాటు ఎక్కువమంది తిరుపతికి వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. విస్తరణ పనుల నేపథ్యంలో వేగం తగ్గించి జాగ్రత్తగా వాహనాలు నడపాల్సిన అవసరం ఉంది. స్థానికులు కూడా సక్రమ మార్గంలోనే వాహనాలతో వెళ్లాలని పలువురు కోరుతున్నారు.

బీఎన్ఐ కాన్‌క్లేవ్ 2.0లాంచ్



కాన్‌క్లేవ్ 2.0ను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'లోకల్ టు గ్లోబల్' అనే నినాదంతో బీఎన్ఐ(బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) తిరుపతి కాన్‌క్లేవ్ 2.0ను లాంచ్ చేశారు. ఆదివారం ఓ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, సీనియర్ సపోర్ట్ డైరెక్టర్ డాక్టర్ సాయికిరణ్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నెట్‌వర్కింగ్ బ్రాండ్ ప్రమోషన్ ద్వారా తిరుపతిలోని చిన్న వ్యాపారాలు కూడా అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎన్ఐ ప్రతినిధులు మణిసందీప్, బాలాజీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కారు,టిప్పర్ ఢీకొని ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పాకాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి పాకాల మండలం గుండ్లగుట్టపల్లె సమీపంలో కారు- టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున దామలచెరువు వైపు నుంచి కల్లూరు వెళ్తున్న కారు, టిప్పర్‌ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సదుంవాసులు ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

నేటి పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రద్దుచేసినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రద్దు చేశామన్నారు. అర్జీదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

ఈపడాదిలో గరుడ సేవల తేదీలు

తిరుమల, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రధానసేవగా భావించే గరుడసేవను భక్తుల సౌకర్యార్థం ప్రతినెలా పౌర్ణమిరోజున కూడా టీటీడీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఈఏడాది పౌర్ణమి గరుడసేవలు జరిగే తేదీలను టీటీడీ అధికారికంగా విడుదల చేసింది. మే15వ తేదీన, జూలై10, ఆగస్టు9, అక్టోబరు7, నవంబరు 11వ తేదీల్లో గరుడవాహనసేవలు జరుగనున్నట్టు టీటీడీ తెలిపింది. జ్యేష్టాభిషేకం సందర్భంగా జూన్11న, చంద్రగ్రహణం సందర్భంగా సెప్టెంబరు7న, కార్తీక దీపోత్సవం సందర్భంగా డిసెంబరు4వ తేదీన పౌర్ణమిగరుడసేవను రద్దు చేసినట్టు టీటీడీ వివరించింది.

పాలిసెట్ దరఖాస్తుకు రేపు చివరి గడువు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2కె25 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు మంగళవారంతో ముగుస్తుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల సమాచార కేంద్రం చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈనెల30న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఆబ్జెక్టివ్ విధానంలో 120మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని, గణితంలో 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 30చొప్పున ప్రశ్నలు ఉంటాయని వివరించారు.ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈపరీక్షకు సంబంధించిన పూర్తివివరాలకోసం 8688888802/03, 9399976999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో చైర్మన్ తనిఖీలు



గోడౌన్‌లో పరిశీలిస్తున్న చైర్మన్ సుధీర్

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సివిల్ సప్లయిస్ ఐజీ గోడౌన్‌లో చైర్మన్ తోట సుధీర్, స్టేట్ డైరెక్టర్ బోడపాటి శివదత్ ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. తిరుపతి డీఎం, సిబ్బంది, రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో వ్యాగన్ నుంచి లోడ్ అయిన 22 లారీలు ఆన్‌లైన్ డేటా సమస్య వల్ల 24 గంటలపాటు నిలిచిపోయాయి. దీనిపై టెక్నికల్ సపోర్టింగ్ టీమ్‌తో చైర్మన్ మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించారు.

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్



నిందితుడిని మీడియాకు చూపుతున్న ఎస్ఐ

నాగలాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడి నుంచి ల్యాప్‌టాప్, ఇయర్ ఫోన్ చోరీచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సునీల్ కథనం మేరకు.. గత ఏడాది మే లో సుబ్బానాయుడుకండ్రిగ సమీపంలో హైవేపై ఓ హోటల్ వద్ద బస్సు ఆగి ఉంది. ఆ సమయంలో బస్సులోని ప్రయాణికుడి ల్యాప్‌టాప్, ఆపిల్ ఇయర్ ఫోన్ చోరీకి గురైంది. బాధిత ప్రయాణికుడు నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇయర్ ఫోన్‌కు అనుసంధానమైన లోకేషన్ ఆధారంగా ఊయటకొడియంబేడుకు చెందిన సలీంబాషను నిందితుడిగా గుర్తించారు. ల్యాప్‌టాప్, ఇయర్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

వరుస చోరీలతో బెంబేలు

- రూరల్ సర్కిల్‌లో సిబ్బంది కొరత
- ఊరెళ్లిన వారి ఇళ్లలో దొంగతనాలు




ప్రశాంత్‌నగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా వస్తువులు

తిరుపతి (నేరవిభాగం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో దొంగలు చెలరేగిపోతున్నారు. మొన్న హరిపురం కాలనీలో దొంగలు పడ్డారు. రూ.1.20 లక్షల నగదు, 30 గ్రాముల బంగారు తాళిబొట్టు, రెండు మొబైల్ ఫోన్లు అపహరించారు. ఆ ఘటన నుంచి తేరుకోక మునుపే తాజాగా సత్యసాయి నగర్‌లో భారీ దొంగతనం జరిగింది. గత రెండు నెలల్లో రూరల్ పరిధిలోనే 9 చోరీ కేసులు నమోదయ్యాయి. ఊరెళ్లిన వారి ఇళ్లనే దొంగలు టార్గెట్ చేసుకుంటున్నారు.

సర్కిల్ పెద్దది..సిబ్బంది కొరత

రూరల్ సర్కిల్ పరిధి విస్తృతం. అయినా.. సీఐ, ముగ్గురు ఎస్ఐలు,15 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీరిలో కోర్టు డ్యూటీలు, వీఐపీ డ్యూటి, సమన్లు సర్వ్‌చేసే డ్యూటీ, ఇతరత్రా రోడ్డు ప్రమాదాలు, వాహనాల తనిఖీలు, విజబుల్ పోలీసింగ్‌కు సరిపోతున్నారు. రాత్రి పూట గస్తీకి సిబ్బంది లేరు. అర్ధరాత్రి 3 గంటల పైన పోలీసులు రోడ్లపైన కనిపించడం లేదని దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడుతున్నారు. లక్షలాది రూపాయల బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు కాజేస్తున్నారు. పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఒకే తరహాలో చోరీలకు పాల్పడుతున్న ముఠాలను గుర్తించడంలో పోలీసులు కొంత నిర్లక్ష్య భావం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రగిరి సబ్‌డివిజన్ పరిధిలోని చంద్రగిరి, పాకాల, తిరుచానూరు సర్కిళ్లకంటే తిరుపతి రూరల్ సర్కిల్‌లో దొంగతనాలు, సైబర్ నేరాలు పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని సచివాలయాల్లో కొందరు ప్రింటర్లు లాంటివి చోరీ చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి రాత్రి గస్తీకి స్పెషల్ పార్టీలను రంగంలోకి దించాల్సిన అవసరం ఉంది.

ప్రసాదాల నాణ్యత బావుంది: ఎల్వీ సుబ్రహ్మణ్యం



తిరుమల, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఇటీవల తీసుకున్న కొన్ని ప్రత్యేక చర్యల గురించి కొందరు భక్తులు నేరుగా నాతో అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్యంగా ప్రసాదాల నాణ్యత, రుచి పెరిగిందని చెప్తున్నారు. ఇందుకు కారణమైన అధికారులను అభినందిస్తున్నాను.' అని రాష్ట్ర మాజీ ముఖ్య కార్యదర్శి, మాజీ టీటీడీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్య అన్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గురించి వ్యాఖ్యానిస్తూ, 'సామాన్యమైన కుటుంబంలో జన్మించి, సంగీత శిక్షణలో అనేక మెరుగులు దిద్దుకుని, స్వామి కీర్తనలను అపురూప రాగాలతో అద్భుతంగా స్వరపరిచిన గొప్పవారు బాలకృష్ణప్రసాద్. స్వామి అనుగ్రహం ఫలితం ఇది.' అన్నారు.

శ్రీవారి సేవలో పలు హైకోర్టుల న్యాయమూర్తులు



జస్టిస్ సుజయ్‌పాల్- జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్,దుప్పల వెంకటరమణలు

తిరుమల, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, ఏపీ హైకోర్టు రిజిస్టర్(మేనేజ్‌మెంట్) రామకృష్ణ, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుళ్ మురుగన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సినీ సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వరరావు ఉన్నారు.
- తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

- మృతుడు టీటీడీ గోశాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి



భాస్కరయ్య (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న టీటీడీ గోశాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న వైనమిది. రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపిన వివరాలిలా... తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన తలుపురు భాస్కరయ్య (60) ఇరవయ్యేళ్లుగా తుమ్మలగుంటలోని టీటీడీ గోశాలలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. ఏడాదిగా టీబీతో బాధపడుతున్నాడు. రుయాలో చికిత్స పొందుతున్నాడు. మరోపక్క మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యం భరించలేకున్నానని, చనిపోవడం మేలని తరచూ అంటుండేవాడు. ఈక్రమంలో ఆదివారం చిన్న కుమారుడు పెళ్లి విందుకు ఎస్వీవో కాలనీలోని పెళ్లికూతురు ఇంటికి వెళ్లాడు. అక్కడ మద్యం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టి విందుకు వెళ్లిపోయారు. సాయంత్రం 4 గంటలకు వారు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా భాస్కరయ్య ఇంటిలో ఫ్యానుకు తాడుతో ఉరి వేసుకుని ఉన్నాడు. దీంతో పెద్ద కుమారుడు భానుప్రకాష్, కుటుంబ సభ్యులు రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే భాస్కరయ్య చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరు సూత్రధారులను మళ్లీ విచారించిన పోలీసులు

- బ్యాంకు చెక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌ట్యాప్‌ల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో జైలులో ఉన్న ఆరుగురిలో ప్రధాన నిందితులు భార్గవ్, అరుణ్‌ను అలిపిరి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో రూ.2 కోట్లు డిమాండు చేస్తూ తన స్నేహితుడు రాజేష్ కుటుంబాన్ని భార్గవ్ కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 5న ఆరుగురు కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించారు. వీరిలో అరుణ్, భార్గవ్‌ను తమ కస్టడీకి తీసుకుని అలిపిరి ఎస్ఐ లోకేష్ బాబు విచారించారు. బీటెక్ చదువుకున్న అరుణ్‌కు సాఫ్ట్‌వేర్‌పరంగా అవగాహన ఉంది. ఇతడితో కలసి భార్గవ్ కంపెనీలు ఏర్పాటుచేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత మంది నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలిసింది. వీటి ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఇద్దరు నిందితుల నుంచి చెక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌ట్యాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి నేర చరిత్రపై ఆరాతీశారు. వీరిద్దరూ డబ్బులకోసం పలువురిని భయాందోళనకు గురిచేసినట్లు విచారణలో తేలింది. చీటింగ్ కేసులూ ఉన్నట్లు తెలిసింది.

భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో వేలాదిగా భక్తులు వరసిద్ధుడి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. ఆలయ క్యూలైను పూర్తిగా నిండిపోయి వెలుపల వరకు విస్తరించాయి. ప్రతి ఒక్కరికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు కృషి చేశారు. భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- భర్త, కుమార్తె పరిస్థితి ఆందోళనకరం



మృతి చెందిన శారద

పుంగనూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కారును మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ టీచర్ మృతి చెందారు. ఆమె భర్త, కుమార్తె పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లెకు చెందిన వై.వెంకటరమణ(45) తన కుమార్తె కీర్తి(17), ములకలచెరువులో టీచరుగా పనిచేస్తున్న భార్య శారద(40)తో కలసి మదనపల్లెకు ఆదివారం కారులో బయల్దేరారు. మధ్యాహ్నం పుంగనూరు మండలంలోని సుగాలిమిట్ట వద్దకొచ్చేసరికి మదనపల్లె వైపు వెళుతున్న మినీ లారీ అతివేగంగా వచ్చి వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో బాధితులను అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శారద మృతి చెందగా.. వెంకటరమణ, కీర్తిల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వీరిద్దరినీ వైద్యుల సూచనలతో కర్ణాటక రాష్ట్ర బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు.

భూమనను విమర్శించే అర్హత నానికి లేదు

తిరుపతిరూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సనాతనధర్మాలపై పరిజ్ఞానం కలిగిన టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే నానికి లేదని వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా సనాతనధర్మాన్ని కాపాడడానికి ఆయన ఎంతో కృషి చేశారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా కోదండరాముడి గ్రామోత్సవం



తిరుపతిరూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం రాత్రి సీతారామ సమేత లక్ష్మణస్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి భక్తుల కర్పూరహారతులు, మంగళవాయిద్యాల మధ్య వేడుక నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ఊంజల్‌సేవ



పిచ్చాటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రామగిరిలో వెలసి ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వేకువ జామున పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఊంజల్ మండపంలో ఉత్సవమూర్తిని ఊయలపై అధిష్ఠింపజేసి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి భక్తులు అమ్మవారి గీతాలను ఆలపించారు.

నేటినుంచి ఈశ్వరయ్య తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో ఈశ్వరయ్య స్వామి

డక్కిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 5గంటలకు అభిషేకం, ఉదయ హారతి, 6 గంటలకు గణపతి పూజ, 6 గంటలకు కలశస్థాపన, 8 గంటలకు నవగ్రహ హోమం, పూర్ణాహుతి, 9 గంటలకు స్వామి చిత్రపటం ఊరేగింపు, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 15వ తేదీ ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణమూర్తుల తెప్పోత్సవం, హారతి నైవేద్యం, 16వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో తిరునాళ్లు ముగుస్తాయి. కడప, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేనున్న నేపథ్యంలో రాపూరు, వెంకటగిరి డిపోల నుంచి 12 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నేతలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల్లో పనిచేసే సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఏపీపీఎస్ఈఏ(ఆంధ్రప్రదేశ్ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్) తిరుపతి శాఖ అధ్యక్షుడు నరేష్ కోరారు. స్థానిక యూత్ హాస్టల్లో ఆదివారం ఏపీపీఎస్ఈఏ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందన్నారు. విధుల నుంచి అకారణంగా తొలగిస్తున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. యూనియన్ నేతలు వివేకానంద, కులశేఖర్, వెంకటేశ్వర్లు, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులతో జాగ్రత్త అవసరం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చర్మ, సుఖ వ్యాధులు చాలా ప్రమాదకరమని, వాటికి సకాలంలో వైద్యం అందించడం ఎంతో అవసరమని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పేర్కొన్నారు. చర్మవ్యాధులకు సంబంధించిన నూతన వైద్య పద్ధతుల్లో ఇటీవల గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఆదివారం చర్మ, సుఖవ్యాధులపై వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవిప్రభు మాట్లాడుతూ సోరియాసిస్, తామర వంటి వ్యాధులకు సరైన వైద్యం అందించకపోతే ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అనంతరం నూతన వైద్య పద్ధతుల గురించి వైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైద్య విభాగాధిపతులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమలుతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా అంబేడ్కర్ కలగన్న సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. అంబేడ్కర్ దార్శనికత - రాజ్యాంగం - సామాజిక న్యాయం అంశంపై సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆదివారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని తెలిపారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ దేశ ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఫైనాన్స్ ఆఫీసర్ రాధాగోవిందత్రిపాఠి మాట్లాడారు. కార్యక్రమంలో సదస్సు కో-ఆర్డినేటర్ వెంకట్రావు, కో కో-ఆర్డినేటర్ చక్రవర్తి, డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ!

వెలగని వీధి దీపాలు

అన్నమయ్య మార్గంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన దీపాలు వెలగడం లేదు. స్తంభాలకు అల్లిన త్రివర్ణ దీపాలూ ఇదే పరిస్థితి. కరకంబాడీ రోడ్డు నుంచి ఉత్తరంగా ఫస్ట్ రైల్వేగేటు వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలలో కొన్ని మాత్రమే వెలుగుతుండడంతో ఆ మార్గం కళావిహీనంగా ఉంటోంది. పైగా రాత్రివేళ కాలినడకన రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పలుమార్లు విద్యుత్ విభాగ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాహన చోదకులు, పాదచారులు ఆరోపిస్తున్నారు.



- తిరుపతి అర్బన్


తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పజెప్పిన పోలీసులు

తిరుపతి (నేర విభాగం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోదండ రామస్వామి తెప్పోత్స వాల్లో తప్పిపోయిన ఐదేళ్ల బాలుడిని పోలీ సులు 10 నిమిషాల వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తిరుపతి మిట్టవీధికి చెందిన శంకర్‌గణేష్ కుటుంబంతో కలిసి ఆదివారం కోదండరామస్వామి తెప్పోత్సవాలకు హాజరయ్యారు. కొంతసేపటికి వారి ఐదేళ్ల కుమారుడు దక్షత్‌కుమార్ కనిపించలేదు. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులకు సమాచారమిచ్చారు. వైర్‌లెస్ సెట్టు, ఆలయంలో ఉన్న అనౌన్స్‌మెంట్ కేంద్రం నుంచి ప్రచారం చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్లు రవికుమార్, జ్ఞానశేఖర్ బృందంగా ఏర్పడి గాలించారు. ఆలయ పరిసరాల్లో తచ్చాడుతున్న బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల పనితీరును వారు ప్రశంసించారు.

ఇంటర్‌లో శ్రీధర్స్ విద్యార్థుల ప్రభంజనం



తిరుపతి(విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ప్రథమ ఎంపీసీలో సి.ఉమామహేశ్వర్ 465 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవస్థానం సాధించగా..కె.నిత్యశ్రీకళ్యాణి, ఎ.లీనాశ్రీ 464, వి.శ్రీకర్‌రెడ్డి 463, ఎస్.యామిని, కె.పనుష్య, పి.వాసవి, పి.మానస 462, సి.షామితరెడ్డి, పి.యశ్విత 460 మార్కులు సాధించారని పేర్కొన్నారు. 37మంది విద్యార్థులు 450కిపైగా మార్కులు పొంది సత్తాచాటారన్నారు. బైపీసీలో సి.జోష్నా 433, వీఎస్ రక్షిత 426, ఎం.దివ్య 422, సి.ధన్యత, వి.ప్రియదర్శిని 419 మార్కులు సాధించారని వెల్లడించారు. 10మంది 410కిపైగా మార్కులు పొందారని తెలిపారు. సీనియర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో బి.వన్షిక, మహ్మద్ ఇమ్రాన్ 987, పి.నిఖిలేశ్వర్ 985, ఆర్.యుక్త 984, మహమ్మద్ తాలిబ్, పోషిత 980 మార్కులతో విజయకేతనం ఎగురవేశారని వివరించారు. 28మంది విద్యార్థులకు 950కిపైగా మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులను శ్రీధర్‌తోపాటు అడ్మినిస్ట్రేటివ్ సీఈవో వాణిశ్రీ అభినందించారు.

ఆధునిక వైద్యరంగం గాడి తప్పింది

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యరంగం గాడి తప్పిందని, వ్యవస్థ అత్యంత అమానవీయ స్థితికి చేరుకుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆద్యులు డాక్టర్ గురుకులమిత్ర సంస్మరణ సభ ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వైద్య రంగం సామాజిక బాధ్యతను కోల్పోతుందని, ఫార్మా పరిశ్రమ దోపిడీకి సాధనంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ వైద్యం బలహీనపడి, కార్పొరేట్ వైద్యం బలపడటానికి కేటాయింపులు తగినంత లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. ఆల్లోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి, ఆక్యుపంక్చర్, యునాని వైద్య ప్రక్రియలలో ఒకదానికి మరొకటి పోటీ కాదని, దేనికి ఉండే ప్రత్యేకతలు దానికి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ జాలేశ్వరరావు, డాక్టర్ రవీంద్ర, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాహుల్, సీనియర్ జర్నలిస్ట్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల మిత్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

పేరులో తప్ప మనిషిలో కరుణ లేదు

అలిపిరిలో టీడీపీ నాయకుల గోపూజ



గోపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందుత్వంపై దాడి చేసేందుకు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అబద్ధపు ప్రచారాలు తెరపైకి తెచ్చారని, పేరులో ఉన్న కరుణ ఆయనలో లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం విమర్శించారు. అలిపిరి సప్త గోమందిరంలో ఆదివారం టీడీపీ నాయకులు గోపూజ నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుపతి గోశాలలో గోవులు మృతి చెందాయని అసత్య ప్రచారం చేసిన కరుణాకరరెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవుడితో రాజకీయాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బుల్లెట్ రమణ, మధుబాబు, రఫీ, ఖాజా, లక్ష్మీ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మంగళం కోళ్లఫారం రిక్షాకాలనీ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. ఏడేళ్ల క్రితం రూ.22లక్షల పంచాయతీ నిధులతో 60 లీటర్ల సామర్థ్యంతో ఎత్తైన వాటర్ ట్యాంక్ నిర్మించారు. సాంకేతిక ఇబ్బందులను పరిశీలించకనే నిర్మాణం పూర్తి చేశారు. 40 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ట్యాంకుకు బోర్ల నుంచి నీరు ఎక్కడం లేదు. పైపులు పగిలిపోతున్నాయి. జాయింట్స్ ఊడిపోతున్నాయి. ఈ క్రమంలో దాన్ని పంచాయతీ అధికారులు పక్కనపెట్టేశారు. టాంకు కిందిభాగంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వ్యర్థాల నిల్వలు చేరాయి. నీటి సరఫరా పైపులు తుప్పుపట్టాయి. గేటువాల్వ్‌లు స్తంభించిపోయాయి. లోపలిభాగం పెచ్చులూడి, రంగు వెలసిపోయాయి. వేసవి దృష్ట్యా రిక్షా కాలనీకి తాగునీటి సమస్య ప్రారంభమైంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



వాటర్ ట్యాంకు - కింద చెట్లపొదలు, వ్యర్థాలు

నేడు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో మహతి ఆడిటోరియంలో బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. వివిధ రంగాల ప్రముఖులు ప్రసంగిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎస్వీ డిఫెన్స్ విద్యార్థుల ప్రభంజనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక తాటితోపులోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. ద్వితీయ ఎంపీసీ గ్రూప్‌లో హేమంత్‌కుమార్ 980, దేవేంద్ర 974, జయకృష్ణమరాజు 971, గోపాల్ 970 మార్కులు సాధించారని వెల్లడించారు. ప్రథమ ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో రేవంత్‌రెడ్డి 458, ఆంజనేయులు 456 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే 7వ తేదీన వెలువడిన ఆర్మీ ఫలితాల్లో 67 మంది ఉద్యోగార్హత పొందారని తెలిపారు. అలాగే అన్ అకాడమీ మెడ్‌జీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయదుందుభి మోగించారన్నారు. ద్వితీయ ఎంపీసీలో మంజునాథ్ 985, రెడ్డివర్ధన్‌రెడ్డి 987 మార్కులు సాధించారని తెలిపారు. ద్వితీయ బైపీసీలో జశ్విత 980, జాతస్య 956, ప్రథమ ఎంపీసీలో లక్ష్మీప్రియ 464, చైతన్య 463, గురు జీవన్ 463, బైపీసీలో రుతికా యాదవ్, మహిమా చౌదరి 433, యషిరా యాదవ్, సగుప్తా 427 మార్కులు సాధించారని తెలిపారు.

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పద్మావతి వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించిందని కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల నుంచి 200 మంది హాజరయ్యారని వెల్లడించారు. భవిష్యత్తులో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల బలిజ కులస్తులను కూడా పాల్గొనే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కమిషన్ సభ్యురాలికి గాయాలు



గాయపడిన మహిళా కమిషన్ సభ్యురాలు - శివారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలికి గాయాలయ్యాయి. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య కథనం మేరకు..తిరుపతికి చెందిన రుకియా బేగం (52) ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. తిరుపతికి చెందిన శ్రీనివాసులు రెడ్డి(28) ఆమె వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం శ్రీనివాసులురెడ్డి ఆమెను నెల్లూరుకు చేర్చేందుకు బయలుదేరాడు. తొట్టంబేడు మండలం కల్లిపూడికి చెందిన కాటూరు శివారెడ్డి(30) చిన్నసింగమాల వద్ద ఓ బంగారు నగల దుకాణంలో పని చేస్తుంటాడు. దుకాణం వద్ద నుంచి సొంత పనులు నిమిత్తం సమీపంలోని పొయ్య గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శ్రీనివాసులురెడ్డి నడుపుతున్న కారు ఢీకొంది. దీంతో శివారెడ్డి ద్విచక్ర వాహనం పక్కనే వెళుతున్న లారీని ఢీకొట్టింది. శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు నడుపుతున్న శ్రీనివాసులు రెడ్డి, అందులో ప్రయాణిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు స్వల్ప గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శివారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరకంబాడి సమీపంలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల ఆరాధ్యుడు బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం డీబీఆర్ రోడ్డులోని ఆయన విగ్రహానికి బీసీ సంఘర్షణ సమితి నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి నాయకులు రామచంద్రయాదవ్, లక్ష్మయ్య, సెల్వరాజ్, కుమార్, పాలముంతల సుబ్బయాదవ్, బీజేపీ నేతలు గుండాల గోపినాథ్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, కట్టమంచి చంద్రబాబుయాదవ్, విక్రమ్‌స్వామి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మోహన్‌రాజు పాల్గొన్నారు.

గల్లా అరుణకుమారి జీవిత చరిత్ర మహిళలకు స్ఫూర్తి

ఎంపీ విజయేంద్రప్రసాద్



విజయేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి దంపతులు

తవణంపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గల్లా అరుణకుమారి జీవిత చరిత్ర మహిళలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి, సినిమా కథల రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్ అన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం తవణంపల్లె మండలంలోని దిగువమాఘం గ్రామంలోని గల్లా నివాసానికి విచ్చేశారు. ఆయనకు గల్లా కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక రాజన్న పార్కులోని మాజీ ఎంపీ, దివంగత రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అరుణకుమారి జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని చదవగా, తనను ఆలోచింపచేసిందన్నారు. మంచి తండ్రికి కూతురిగా, మంచి భర్తకు మంచి భార్యగా, మంచి పిల్లలకు మంచి తల్లిగా, ప్రజలకు మంచి సేవలు అందించే నాయకురాలిగా ఎదిగిన తీరు మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. గల్లా కుటుంబం అనుమతిస్తే అరుణకుమారి జీవిత చరిత్రను సినిమా కంటే వెబ్ సిరీస్ రూపంలో తీస్తే బాగుంటుందన్నారు. ఆ తర్వాత దిగువమాఘం గ్రామంలో గల్లా కుటుంబం ప్రజలకు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. అమరరాజా ద్వారా సుమారు 18వేల మందికి ఉపాధి కల్పించిన గల్లా, గౌరినేని కుటుంబాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవుడి విషయంలో దుష్ప్రచారం మానండి

చేతనైతే అభివృద్ధికి సలహాలు ఇవ్వండి ● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ గోశాలలో గోవుల మరణాలపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ హితవు పలికారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ గోవు అత్యంత పవిత్రమైందని, అలాంటి వాటిని, టీటీడీకి సంబంధించిన అంశాలను రాజకీయాలకు వాడుకుంటే పుట్టగతులు లేకుండా పోతారని హెచ్చరించారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు తిరుమల భక్తులు, తిరుపతి ప్రజల పట్ల అనేక వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని, అందుకే గత ఎన్నికల్లో చావు దెబ్బ తిన్నారని దుయ్యబట్టారు. టీటీడీ ప్రతిష్ఠను భంగపరిచే విధంగా, కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి చేస్తున్న ప్రచారం బాధాకరమని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ అక్రమాలకు, అన్యాయాలకు మారుపేరైన కరుణాకరరెడ్డి చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, ఊట్ల సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

కోటి సభ్యులున్న పార్టీ మనదే

సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీలో టీడీపీ నేతలు



గుర్తింపు కార్డులు చూపుతున్న సభ్యులు, నేతలు

తిరుపతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి సభ్యత్వాలు కలిగిన పార్టీ మనదేనని, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే మనబలమని టీడీపీ నేతలు అన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 35వ డివిజన్లో సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ పార్టీ సభ్యులకు ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగన్, ఉపాధ్యక్షుడు రవితేజ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి, సుజాతమ్మ, సురేష్, చంద్రా రెడ్డి, సుబ్బు యాదవ్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో టీటీడీ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని జూనియర్ కళాశాలల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారని టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో 93 శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 623 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 570 మంది పాసయ్యారని పేర్కొంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 717 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 571 మంది పాసై 80 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించింది. ఎస్వీ జూనియర్ కళాశాల 84.50 శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వెంకటచరణ్ 977 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారని పేర్కొంది. కళాశాలలో 355 మంది పరీక్షలు రాయగా 300 మంది ఉత్తీర్ణత పొందారని తెలిపింది. ప్రథమ సంవత్సరంలో లక్ష్మీచరణ్ 461 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడని, 531 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 309 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించింది. విద్యార్థులను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు, జేఈవో వి.వీరబ్రహ్మం అభినందనలు తెలిపారు.

సమాజ సేవను బాధ్యతగా భావించాలి


తిరుపతిలో క్లీన్ డ్రైవ్ నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి వాసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ సంస్థ వలంటీర్లు తెలిపారు. సంస్థ ద్వారా సమాజ సేవపై అవగాహన కల్పించేలా తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. శ్రీకాళహస్తికి చెందిన సంస్థ సభ్యులు శిక్షణకు హాజరయ్యారు. ఇందులో భాగంగా తిరుపతిలోని మంగళం రోడ్‌లో బొంతాలమ్మ గుడి వద్ద క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. అక్కడి పరిసరాలను శుభ్రం చేశారు. స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి పట్టణంలోని 29వ వార్డులో పురపాలక సంఘం సిబ్బంది దెబ్బతిన్న వీధిలైట్లను మార్పు చేశారు. ఈ వార్డు పరిధిలో వీధిలైట్ల సమస్య ఉన్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన అధికారులు మరమ్మతులకు గురైన వీధిదీపాలను తొలగించి కొత్తవి అమర్చారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


గాయపడిన సతీష్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారానికి చెందిన మునీంద్ర, శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరుకు చెందిన సతీష్ ఇద్దరు ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. శనివారం రాత్రి అరవకొత్తూరు వద్ద ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రిఫర్ చేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయంలో గుజరాత్ హైకోర్టు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా గుజరాత్ హైకోర్టు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ దుప్పల వెంకటరమణ వేర్వేరుగా ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ దుప్పల వెంకట రమణ

వెంకటాపురం చెరువులో యథేచ్ఛగా మట్టి తరలింపు


చెరువులో మట్టిని ట్రాక్టర్‌ను నింపుతున్న ఎక్స్‌కవేటర్


పొలాన్ని రోడ్డు ఎత్తుకు పెంచేందుకు మట్టిని పోస్తున్న ట్రాక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం చెరువు నుంచి పట్టపగలే యథేచ్ఛగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం కరకంబాడి -తిరుపతి రోడ్డు మార్గంలోని వెంకటాపురం పంచాయితీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న చెరువులో ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్లలో మట్టిని నింపి సమీపంలో రోడ్డు పక్కనున్న వరి పొలంలో రోడ్డుకు సమానంగా ఎత్తు పెంచేందుకు పోస్తున్నారు. రెండు రోజులుగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం. ఈ విషయంపై ఇన్‌చార్జ్ వీఆర్‌వో రామ్‌చరణ్‌ను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భగవద్గీత ఉన్నత జీవితానికి బాట


మాట్లాడుతున్న విద్యా స్వరూపానందగిరి స్వామి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పఠనం ఉన్నతమైన జీవితానికి బాటలు వేస్తుందని శ్రీకాళహస్తి శుక బ్రహ్మ ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపా నంద గిరి స్వామి తెలిపారు. పట్టణం లోని ఆశ్రమంలో ఆదివారం మూడవ రోజు ఆరాధన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కర్తవ్య నిష్ఠతో మానవ జీవితాన్ని ఎలా ఉన్నత స్థాయి లో నిలుపుకోవాలో గీతా సారం బోధిస్తుందన్నారు. అనంతరం ఆశ్రమంలో యోగా శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. యానంద సరస్వతీ మాతాజీ, గురు చరణానంద మాతాజీ, బసవ రాజేంద్ర మహాస్వామి, శ్రీహరి తీర్థ స్వామి, సోప్రకాశానంద సరస్వతి స్వామి, యోగా మాస్టర్ మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరు ఆలయంలో రేపు సీతారాముల కల్యాణం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరులోని అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7:30నుంచి 8:30 గంటల కల్యాణం జరుగుతుందన్నారు.

రేపు మండల సమావేశం

పెళ్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ప్రమీలారాణి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

టైక్వాండో క్లబ్ ఏర్పాటు

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో శిక్షణ కోసం మాస్టర్ టైక్వాండో క్లబ్‌ను నాయుడుపేటలో ఏర్పాటు చేస్తున్నట్లు కోచ్ పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. క్రీడల్లో బాలికలు, బాలురుకు శిక్షణతో పాటు వారిలో ప్రతిభను వెలికితీసేలా క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు

చిల్లకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతి ప్రవేశానికి 170 మంది దరఖాస్తు చేసుకోగా 148 మంది, ఇంటర్మీడియట్ ప్రవేశానికి 156 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 137 మంది పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సుబ్బారావు తెలిపారు.

కోట: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం పరీక్షలు జరిగాయి. 5వ తరగతికి 110మంది, ఇంటర్మీడియట్‌కు 121మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.



ఆధునికీకరించిన ప్లాట్‌ఫారం - స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లిఫ్టులు

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

- రూ.12 కోట్లతో ఆధునికీకరణ
- ప్రయాణికులకు సకల సౌకర్యాలు
- నెలాఖరులో ప్రారంభానికి సన్నాహాలు


చెంగాళమ్మ ఆలయ నమూనాతో నిర్మించిన రైల్వేస్టేషన్ ముఖద్వారం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ కొత్త హంగులు సంతరించుకుంది. అమృత్ భారత్ పథకం కింద సుమారు రూ.12 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ నెలాఖరు కల్లా పనులు పూర్తిచేసి ప్రారంభించేందుకు రైల్వే అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షార్, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడ కేంద్రమైన సూళ్లూరుపేట శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడి రైల్వేస్టేషన్‌ను విస్తరించడంతో పాటు కొత్త హంగులతో మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

చెంగాళమ్మ ఆలయ నమూనాతో స్టేషన్ ముఖద్వారం

జిల్లా కేంద్రమైన తిరుపతి రైల్వేస్టేషన్‌ను ఆదర్శంగా తీసుకొని సూళ్లూరుపేటలో ప్రసిద్ధి గాంచిన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ నమూనాతో రైల్వేస్టేషన్ ప్రధాన ముఖద్వార నిర్మాణం చేపట్టారు. ముఖద్వారం వెలుపుల గార్డెన్లు, అత్యంత ఆధునిక సీసీ కెమెరాలు, సమాచారాన్ని తెలియజేసే ఎలక్ట్రానిక్ బోర్డులు ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రారంభం నుంచి చివరి వరకు సుందరీకరణ పూర్తయ్యింది.

ప్రయాణికులకు సకల సౌకర్యాలు

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పించారు. మూడు ప్లాట్‌ఫారాలు ఉండగా పడమర వైపు ఒక లిఫ్టు, తూర్పువైపు ఒక లిఫ్టు ఏర్పాటు చేశారు. విశ్రాంతి భవనం, బుకింగ్ కౌంటర్, శుద్ధినీటి ప్లాంట్లు, మరుగుదొడ్లు నిర్మించారు.స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు తెలియజేసేందుకు రైల్ ఇండికేషన్ బోర్డు, కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే ప్లాట్‌ఫారమ్ షెడ్‌ను వెడల్పు చేశారు. ప్రయాణికులకు వాహనాల పార్కింగ్ స్థలాన్ని విస్తరించారు. వాహనాలకు భద్రత కల్పించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానం చేశారు.



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం - చలువ పందిళ్లు

నేటినుంచి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో ఈశ్వరయ్య స్వామి - ఆలయంలో ధ్వజారోహణ పూజలు చేస్తున్న వేదపండితులు

దక్కిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్ల సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 5గంటలకు అభిషేకం, ఉదయ హారతి, 6 గంటలకు గణపతి పూజ, 6 గంటలకు కలశస్థాపన, 8 గంటలకు నవగ్రహ హోమం, పూర్ణాహుతి, 9 గంటలకు స్వామి చిత్రపటం ఊరేగింపు, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 15వ తేదీ ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణమూర్తుల తెప్పోత్సవం, హారతి నైవేద్యం, 16వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో తిరునాళ్లు ముగుస్తాయి. కడప, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేస్తున్న నేపథ్యంలో రాపూరు, వెంకటగిరి డిపోల నుంచి 12 బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. స్వామివారిని భక్తులు సులభంగా దర్శించుకులా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఆలయం వద్ద చలువ పందేళ్లు, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు పరసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా 139 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. డైమండ్ డబ్బా, పేకాట, అశ్లీల నృత్య ప్రదర్శన వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి నిఘా ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ మృతి



గూడూరు అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కృష్ణమోహన్ అనారోగ్యంలో ఆదివారం మృతిచెందారు. చాలా సంవత్సరాలుగా పలు వార్తా పత్రికలలో జర్నలిస్టుగా ఈయన విధులు నిర్వహించారు. పట్టణంలోని పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు కృష్ణమోహన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం


బాధితుడికి నగదు అందజేస్తున్న శ్రీనివాసులు నాయుడు

చిల్లకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పున్నపువారి పాళెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటరామ్‌కు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ శ్రీనివాసులునాయుడు రూ.20వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. వెంకటరామ్‌కు చెందిన రేకుల ఇంటిపై ఇటీవల గాలికి వేపచెట్టు విరిగి పడడంతో ధ్వంసమైంది. భార్యభర్తలు ఇద్దరూ దివ్యాంగులు కావడంతో తన వంతు ఆర్థికసాయం చేశానని శ్రీనివాసులునాయుడు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా పాల్గొన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఏప్రిల్ 13: గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీరాముడి నగరోత్సవం


నగరోత్సవంలో భక్తులు

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బ్రాహ్మణవీధిలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆదివారం నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పసుపు బట్టలతో వసంతాలు చల్లుకుంటూ నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కోటా వెంకటేశ్వర్లు గూడూరు కిషోర్, సొల్లేటి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, దర్శి రమేష్, సొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా సుబ్బారావు



నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా నానాబాల సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, టీడీపీ నియోజక ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ధృవీకరించారు.

రాజ్యాంగం అమలుతోనే సామాజిక న్యాయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా అంబేడ్కర్ కలగన్న సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. అంబేడ్కర్ దార్శనికత - రాజ్యాంగం - సామాజిక న్యాయం అంశంపై సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆదివారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని తెలిపారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ దేశ ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఫైనాన్స్ ఆఫీసర్ రాధాగోవిందత్రిపాఠి మాట్లాడారు. కార్యక్రమంలో సదస్సు కో-ఆర్డినేటర్ వెంకట్రావు, కో కో-ఆర్డినేటర్ చక్రవర్తి, డాక్టర్ కనపాల కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభ్యాసంతోనే ఉజ్వల భవిత

నాయుడుపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం ద్వార ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట సాయిశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించి ఆయా రంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఎంఈవో మునిరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, గూడూరు సుధీర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవదానం సుధీర్, రాజశేఖర్ రెడ్డి, అనూష, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసింది వైసీపీనే: పాశిం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసిందని వైసీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చి సస్పెండ్ అయిన హరినాథరెడ్డి అనే అధికారి కోసం మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. ఎప్పుడో చనిపోయిన ఆవుల ఫొటోలను చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, మధుసూదన్‌రెడ్డి, జనార్దన రెడ్డి, చంద్రమౌళి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు భూమన క్షమాపణ చెప్పాలి: విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని గోశాలలో గోవులు మరణించాయని అసత్య ఆరోపణలు చేసిన మాజీ టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి భక్తులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుమల పవిత్రత దెబ్బతినేలా భూమన మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తిరుమలలో ప్రక్షాళన ప్రారంభించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు, శ్రీధర్, కొండల్‌రావు, బీజేపీ నాయకుడు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడే వారికి న్యాయం జరగడం లేదు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో కష్టపడే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు న్యాయం జరగడంలేదని ఆ పార్టీ నేత అప్పాడి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అన్నదానం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారు వీధిలో వెలిసిన రామమందిరంలో వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం టీడీపీ నాయకులు, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబు, చేవూరు చెంగయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు కోట వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



ప్రకృతి చెక్కిన గజేంద్రుడు



శ్రీకాళహస్తిలోని కనకాచలంపై గజేంద్రుని రూపంలో ఉన్న సహజ శిల దృశ్యం ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూసింది. బిల్వ వనంలో కొలువైన వాయు లింగేశ్వరుడుగా ఉన్న పరమశివుని పూజిస్తూ పాము, ఏనుగు, సాలీడు మూగజీవులుగా ముక్తి పొందిన విషయం తెలిసిందే. ఆ ముగ్గురి భక్తుల పేర్లతోనే శ్రీకాళహస్తి క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. తాజాగా వెలుగుచూసిన ఈ శిలా అద్భుతాన్ని చూసి తీరాల్సిందేనని పలువురు అభిప్రాయాలు కామెంట్ల రూపంలో వ్యక్తం చేశారు.

- శ్రీకాళహస్తి

నేల కూలిన వృక్షం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళ హస్తిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఆదివారం ఉద యం భారీ వృక్షం నేల కూలింది. తిరుపతి -శ్రీకాళహస్తి రహదారి నుంచి కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రోడ్డు మలుపు వద్ద ఉండే పెద్ద వృక్షం ఆదివారం ఉదయం హఠాత్తుగా వాలిపోయింది. దీంతో ఈ మార్గంలో సుమారు గంట పాటు రాకపోకలు స్తంభించాయి. పురపాలక సంఘం సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టును తొలగించారు.

జిల్లా ప్రథమ స్థానం అభినందనీయం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో జిల్లాలో 467 అత్యుత్తమ మార్కులతో మొదటి స్థానం సాధించిన భావనను పలువురు ఘనంగా అభినందించారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఎంజీఎం జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న భావన మొదటి సంవత్సరం ఫలితాలలో 467 మార్కులతో ప్రతిభ చాటింది. ఈ మేరకు ఆదివారం కళాశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ విద్యార్థినిని ఘనంగా అభినందించారు.

ఘనంగా శ్రీవిద్య హైస్కూల్ వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

సత్యవేడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శని వారం రాత్రి పాఠశాల నాల్గవ వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ నాగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. వీఎంకే కళ్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా సీఐ మురళి, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ మస్తాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడి మృతి



అజిత్ మృతదేహం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని ఓ వలస కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరు వద్ద ఆదివారం జరిగింది. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అజిత్‌దార్ అనే యువకుడు రాచగున్నేరి వద్ద ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సరుకులు కొనుగోలు చేసేందుకు అద్దె గది నుంచి దుకాణం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం తడుకులో సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో తడుకు పంచాయితీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీటీడీ గోశాలపై ఆరోపణలు అర్థరహితం

● నగరి శాసన సభ్యులు గాలి భాను ప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాస్తికుడైన భూమన కరుణాకర రెడ్డి టీటీడీ గోశాలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం అర్థరహితమని నగరి శాసన సభ్యులు గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తప్పుడు ప్రచారాలతో మత విద్వేషాలు రెచ్చగొట్టాలన్నదే వైసీపీ కుట్రగా పేర్కొన్నారు. గతంలో పింక్ డైమెండ్‌పై కూడా తప్పుడు ప్రచారం చేశారని గుర్తుచేశారు. దేశంలోనే తలమానికంగా గోవుల సంరక్షణ, నిర్వహణను టీటీడీ గోశాల చేపడుతోందని పేర్కొన్నారు. గోశాలలో 2,668 ఆవులకు జియో ట్యాగింగ్ చేసి వాటి జనన, మరణాల రిజిస్టర్‌ను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరులో మార్పు రాలేదని విమర్శించారు. టీటీడీ పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలియజేశారు. వైసీపీ నేతలు ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని లేనిపక్షంలో శ్రీవారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

రాష్ట్రపతి ఆమోదానికి సమయ నిర్దేశం సరికాదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి సమయాన్ని నిర్దేశించడం సరికాదని శ్రీకాళహస్తికి చెందిన న్యాయవాది విజయ్ కిరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయానికి ఆన్‌లైన్ గ్రీవెన్స్ ద్వారా వినతిని సమర్పించారు. వినతిని స్వీకరించినట్లు రాష్ట్రపతి కార్యాలయం నుంచి సమాచారం అందిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బోయలను ఎస్టీల్లో చేర్చవద్దు గిరిజన సంఘాల డిమాండ్



నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘాల సభ్యులు

రేణిగుంట, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి): బోయలను ఎస్టీ జాబితాలో చేర్చ వద్దు అంటూ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ గిరిజన సంఘం ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన మైదాన ప్రాంత గిరిజన తెగకు చెందిన ఎరుకుల, యానాది, లంబాడి, షికారి కులాలకు ద్రోహం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సత్య నారాయణ, ప్రభాకర్, హరినాథ్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

వినాయకపురంలో పోలీసుల కార్డన్ సర్చ్



ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని యువతకు సూచనలు అందజేస్తున్న పోలీసులు

రేణిగుంట, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి): గాజులమండ్యం పోలీసులు వినాయకపురం పారిశ్రామికవాడలో ఆదివారం తెల్లవారు జామున కార్డెన్ సర్చ్ నిర్వహించారు. రేణిగుంట, తిరుపతి రోడ్డు మార్గంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అనుమానితుల సంచారం ఉండడం, ఇక్కడ పనిచేస్తున్న అధిక శాతం మంది వినాయక పురంలో కాపురం ఉండడంతో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తుంటే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాజులమండ్యం, ఏర్పేడు సీఐలు మురళీకృష్ణ, జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, పోలీస్‌లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి మండల టాపర్



లక్ష్మీప్రసాద్

సత్యవేడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు బీసీ హాస్టల్ విద్యార్థి పి.లక్ష్మీ ప్రసాద్ మండల టాపర్‌గా నిలిచాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న లక్ష్మీప్రసాద్ ఎంపీసీలో 981 మార్కులు సాధించిన విషయం తెలిసిందే. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన లక్ష్మీప్రసాద్ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. బీసీ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. తల్లి ప్రోత్సాహం, అన్నయ్య సహకారంతో పట్టుదలతో చదివి మండల టాపర్‌గా నిలిచాడు. తమ హాస్టల్ విద్యార్థి టాపర్‌గా నిలవడం పట్ల వార్డెన్ సంతోషం వ్యక్తం చేశారు.

కల్తీ నెయ్యి వ్యవహారం కప్పిపుచ్చడానికే గోవుల పేరుతో కుట్ర

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కల్తీ నెయ్యి వ్యవహారాన్ని కప్పిపుచ్చడానికే గోవుల మృతి అంటూ తప్పుడు ప్రచారానికి వైసీపీ శ్రీకారం చుట్టిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎక్కడ తమ లొసుగులు బయటకు వస్తాయనే భయంతో తిరుమల గోశాల అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. గోవులు మృతిచెందినట్లు మార్ఫింగ్ ఫోటోలు సృష్టించి రాజకీయాలు చేయడం టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మానుకోవాలని సూచించారు. వాస్తవాలు వెలుగు చూడడం ఖాయమని తప్పుడు ప్రచారకులు వెంకన్న ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

లారీ బోల్తా

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : లారీ అదుపు తప్పి బోల్తాపడింది. నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ మినీ లారీ కన్నలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై అదుపుతప్పి సర్వీస్ రోడ్ గ్రిల్స్‌ను ఢీకొట్టింది. డ్రైవర్‌చాకచక్యంగా దూకేయడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ సమావేశం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ కూడలిలో మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ రాజ్యాంగ పరిరక్షణకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ శ్రీకాళహస్తి కార్యదర్శి గోపి ఆదివారం తెలిపారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు అంబేద్కర్‌కు నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం అదే కూడలిలో సమావేశం నిర్వహిస్తామని తెలియజేశారు.

బ్రాహ్మణపల్లిలో దాహం..దాహం



వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న జనం

కేవీబీపురం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామంలో రెండు చేతిబోర్లు, ఒక ట్యాంకు ఉంది. ఉన్న రెండు చేతిబోర్లలో ఒక బోరులో నీరే తాగడానికి ఉపయోగపడుతోంది. మరో బోరులోని నీరు చిలుము వాసన వస్తుండ డంతో వినియోగించుకోలేని పరిస్థితి. ట్యాం కుకు అనుసంధానం చేసిన విద్యుత్ మోటా రు పాడైపోయింది. దీంతో ఒక బోరులో నీరు చాలక గ్రామస్తులు వ్యవసాయ బోర్లను ఆశ్రయి స్తున్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించాలని కోరుతున్నారు.

తిరుపతి విమానాశ్రయంలో డీసీఎం సతీమణి



రేణిగుంట, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా ఆదివారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. వీరి కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం కోలుకోవడంతో తిరుమల శ్రీవారికి మొక్కు తీర్చుకోవడానికి ఆమె వచ్చారు. ఆమె వ్యక్తిగత పర్యటన కావడంతో ప్రైవేటు సెక్యూరిటీతో రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సత్యవేడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తం గా శనివారం విడుదలయిన ఇంటర్మీడి యట్ పరీక్ష ఫలితాల్లో సత్యవేడులోని డీ.బాబు ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు హవా కొన సాగించినట్లు ప్రిన్సిపాల్ డీ.పరంధామ్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో హేమలత 972, ఎం.కిషోర్ 968, ఎల్.మనస్విని 968 మార్కులు సాధించగా బైపీసీలో పీ.జీ. అశ్విత 975, ఏ.మనీషా 958, ఎస్.జయలక్ష్మి 953 మార్కులు సాధించారు. సీఈసీలో కే.రేవతి 894, ఎం.లయ 883, డీ.హేమా 868 మార్కులు సాధించారు. ఎంఈసీలో కే.అక్షయ 910, ఎస్.హేమప్రియ 898 మార్కులు సాధించారు. అదేవిధంగా ఫస్ట్ యర్ ఎంపీసీలో కే.భూమిక 456, ఎస్.చక్రిత 441, జే.రాఘవేంద్ర 441 మార్కులు సాధించారు. సీఈసీలో రషీద 456, మదీన 450, ఎంపీడబ్ల్యుహెచ్‌లో ఎల్.సంవిత 440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అధ్యాపకులు అభినందించారు.

గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సామంచి శ్రీనివాసులు

సత్యవేడు, ఏప్రిల్, 13 (ఆంధ్రజ్యోతి): పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీని వాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో భవనంలో సత్యవేడు నియోజకవర్గ స్థాయి బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సామంచి ముఖ్య అతిథిగా విచ్చేసి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర ప్రసాద్, ముని క్రిష్ణయ్య, సత్యనారాయణరెడ్డి, నిద్ధలయ్య, వెంకటేష్ రెడ్డి, మోహన్‌బాబు, వెంకటేశులు శెట్టి, పురుషోత్తంనాయుడు, పీఎం శేఖర్, బాలాజీ, డిల్లీ, అయ్యప్ప పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్



నిందితుడిని మీడియాకు చూపుతున్న ఎస్ఐ

నాగలాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడి నుంచి ల్యాప్‌టాప్, ఇయర్ ఫోన్ చోరీచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సునీల్ కథనం మేరకు.. గత ఏడాది మే నెలలో సుబ్బానాయుడుకండ్రిగ సమీపంలో హైవేపై ఓ హోటల్ వద్ద కర్నూలుకు వెళ్లే బస్సు ఆగి ఉంది. ఆ సమయంలో బస్సులోని ప్రయాణికుడికి చెందిన ల్యాప్‌టాప్, ఆపిల్ ఇయర్ ఫోన్ చోరీకి గురైంది. బాధిత ప్రయాణికుడు నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇయర్ ఫోన్‌కు అనుసంధానమైన లోకేషన్ ఆధారంగా మండలంలోని బయటకొడియంబేడుకు చెందిన సలీంబాషను నిందితుడిగా గుర్తించారు. అతడి నుంచి ల్యాప్‌టాప్, ఇయర్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం

కేవీబీపురం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయి మందిరం 18వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సాయినామ స్మరణతో పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయినాథుని చిత్రపటాన్ని ఊరేగించారు.

ఘనంగా మట్టల ఆదివారం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించు కు న్నారు. బీఎన్‌కండ్రిగలోని ఈసీఐ చర్చి వారు మట్టలతో ర్యాలీ చేశారు. పాస్టర్ జాన్‌వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు పిచ్చాటూరులో ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆదిమూలం పిచ్చాటూరులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు పిచ్చాటూరు సాయిబాబా గుడి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నారు.

భక్తి ప్రపత్తులతో ఊంజల్‌సేవ



విశేషాలంకరణలో అమ్మవారు

పిచ్చాటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రామగిరిలో వెలసి ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వేకువ జామున పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఊంజల్ మండపంలో ఉత్సవమూర్తిని ఊయలపై అధిష్ఠింపజేసి వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి భక్తులు అమ్మవారి గీతాలను ఆలపించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించ నున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉద్యోగ భరోసా కల్పిస్తూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మెగా జాబ్ మేళా నిర్వహించడం హర్షణీయం అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన పలువురు టీడీపీ నేతలతో కలిసి ఉద్యోగమేళాపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన కొత్త బైపాస్ రోడ్‌లోని ఎస్ఎస్ కళ్యాణ మండపంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి పురస్కరించుకుని ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు మిన్నల రవి, బుజ్జి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కమిషన్ సభ్యురాలికి గాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలికి గాయాలయ్యాయి. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య కథనం మేరకు..తిరుపతికి చెందిన రుకియా బేగం (52) ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. తిరుపతికి చెందిన శ్రీనివాసులు రెడ్డి(28) ఆమె వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం శ్రీనివాసులురెడ్డి ఆమెను నెల్లూరుకు చేర్చేందుకు బయలుదేరాడు. తొట్టంబేడు మండలం కల్లిపూడికి చెందిన కాటూరు శివారెడ్డి(30) చిన్నసింగమాల వద్ద ఓ బంగారు నగల దుకాణంలో పని చేస్తుంటాడు. దుకాణం వద్ద నుంచి సొంత పనుల నిమిత్తం సమీపంలోని పొయ్య గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శ్రీనివాసులురెడ్డి నడుపుతున్న కారు ఢీకొంది. దీంతో శివారెడ్డి ద్విచక్ర వాహనం పక్కనే వెళుతున్న లారీని ఢీకొట్టింది. శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు నడుపుతున్న శ్రీనివాసులు రెడ్డి, అందులో ప్రయాణిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు స్వల్ప గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శివారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరకంబాడి సమీపంలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





గాయపడిన మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగం, శివారెడ్డి